సాక్షి వికారాబాద్

శనివారం : 24 : ఫిబ్రవరి : 2024



మరమ్మతు చేయరు..

రాష్ట్రంలో చెరువులు, ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. నీరు పుష్కలంగా ఉన్నా సాగుకు అందని పరిస్థితి. 8లో▸



పన్నులు వసూలయ్యేనా?

గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్ల విషయంలో అధికారులు నిబంధనలు పాటించడం లేదు. 8లో▸



సమ్మర్ గండం

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలతో గ్రామాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. 9లో▸

న్యూస్‌రీల్

అవిశ్వాసం ప్రవేశపెట్టండి

కలెక్టర్‌ను కోరిన జెడ్పీటీసీలు



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయ్‌కుమార్ తదితరులు

వికారాబాద్: జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డిపై అవిశ్వాసం ప్రవేశ పెట్టాలని వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు కొప్పుల నాగిరెడ్డితో కలసి పలువురు సభ్యులతో కలెక్టర్ నారాయణ రెడ్డిని కలిసి విన్నవించారు. బీఆర్ఎస్ తరఫున గెలిచి జెడ్పీ చైర్‌పర్సన్ బాధ్యతలు చేపట్టిన పట్నం సునీతారెడ్డి ఈ నెల 15న పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే బీఆర్ఎస్‌కు చెందిన 12మంది జెడ్పీటీసీలు అడిషనల్ కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. అయితే అవిశ్వాస సమావేశ తేదీని ప్రకటించకపోవడంతో వారు మరో సారి కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. త్వరగా తేదీని ప్రకటించాలని కోరారు. అవిశ్వాసం ప్రక్రియపై స్పష్టత లేనందున ప్రభుత్వానికి లేఖ రాశామని కలెక్టర్ వారికి తెలిపినట్లు సమాచారం.

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సెక్రటరీ జర్నల్‌గా హన్మంతు



హన్మంతు ముదిరాజ్‌ను అభినందిస్తున్న సంఘం నాయకులు

పరిగి: ఐఎన్‌టీయూసీ రాష్ట్ర సెక్రటరీ జర్నల్‌గా హన్మంతు ముదిరాజ్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు సంజీవ్‌రెడ్డి శుక్రవారం నియామక పత్రం అందజేశారు. టీజేఎంయూను వ్యవస్థాపకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు ఐఎన్‌టీయూసీలో విలీనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీజేఎంయూ చిరకాల వాంచ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడమే అన్నారు. మా కోరిక సఫలీకృతం అవుతున్న క్రమంలో యూనియన్‌ను విలీనం చేస్తున్నట్లు తెలిపారు. 2017 నుంచి 2021 వరకు వేతన సవరణ, బకాయిల విషయాన్ని ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరిస్తామని చెప్పడంతో విలీనం చేసినట్లు తెలిపారు.

వైద్యశాఖలో కాంట్రాక్ట్ పద్ధతిన పోస్టుల భర్తీ

అనంతగిరి: నేషనల్ హెల్త్ మిషన్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలో 54 పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈ నెల 24నుంచి 29వ తేదీ వరకు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. మెరిట్, రోస్టర్ పాయింట్ల ఆధారంగా ఎంపిక ఉంటుందని తెలిపారు. వ్యాక్సిన్ కోల్డ్ చైన్ మేనేజర్ -1, స్టాఫ్ నర్స్-17, స్టాఫ్ నర్స్-01, ఎంఎల్‌హెచ్‌పీ-25, డిస్ట్రిక్ డేటా మేనేజర్ -02, డిస్ట్రిక్ట్ ఎపిడెమాలజిస్ట్-01, డేటా ఎంట్రీ ఆపరేటర్ -01, ఎర్లీ ఇంటర్వెన్షనిస్ట్ కం స్పెషల్ ఎడ్యుకేటర్- 01, ఆప్టోమెట్రిస్ట్-01, పేడియాట్రీషన్-01, సైకాలజిస్టు -01, మెడికల్ ఆఫీసర్ -01, ఫార్మాసిస్ట్-01 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న వేణుగోపాల్

పరిగి: ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు రావాల్సిన మూడు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో తాము అన్ని విధాలా ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఈ ప్రభుత్వమైనా తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొత్త పీఆర్‌సీ, బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని విన్నవించారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం

నేత్రపర్వం.. రేణుకా ఎల్లమ్మ రథోత్సవం

కొడంగల్ పట్టణ శివారులో వెలిసిన బండల ఎల్లమ్మ తల్లి జాతర ఘనంగా జరుగుతోంది. శుక్రవారం అమ్మవారిని రథంపై ప్రతిష్ఠించి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేయించారు. ఈ వేడుక కనుల పండువగా సాగింది. వేలాదిమంది భక్తులు ఎల్లమ్మను దర్శించుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి నైవేద్యం సమర్పించారు. ఎస్ఐ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్తలు అచ్యుతారెడ్డి, రాంరెడ్డి, రాఘవేందర్‌రెడ్డి జాతర ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– కొడంగల్



బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు, యువతులు

రూ.16 కోట్లతో ఆలయ అభివృద్ధి

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ పట్టణంలోని పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.16 కోట్లు మంజూరు చేసింది. రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ముఖ్యమంత్రి స్థాయికి వెళ్లేంత వరకు ఈ ఆలయంలో పూజలు చేసేవారు. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే రథోత్సవ వేడుకలో రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొనడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయ అభివృద్ధి, విస్తరణ, మండపాల నిర్మాణం, గదులు, సత్రాల నిర్మాణం తదితర వాటికి రూ.16 కోట్లు మంజూరు చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలోనే ఇక్కడ నిత్యం పూజలు జరుగుతాయి. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలు, పవిత్రోత్సవాలు, లక్ష తులసీ అర్చన, ధనుర్మాసం, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి తదితర పర్వదినాలను ఘనంగా నిర్వహిస్తారు. నిత్య కైంకర్యాలు, పూజలు, సుప్రభాతం, తోమాల సేవ, అలంకరణలు ఉంటాయి. బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు పెద్ద శేషవాహనం, చిన్న శేషవాహనం, హంస వాహనం, సింహ వాహనం, వ్యాళి వాహనం, కల్ప వృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, మోహినీ అవతార ఉత్సవం, గరుడోత్సవం, హనుమంత వాహనం, వసంతోత్సవం, గజ వాహనం, సూర్య ప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, రథోత్సవం, అశ్వ వాహనం, పల్లకీ ఉత్సవం, చక్రస్నానం తదితర వాహనాలు ఉంటాయి. అలాగే కోస్గిలోని పురాతన వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరు చేయడంపై శ్రీవారి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.



శ్రీవారి మూలమూర్తి

బల్దియా బడ్జెట్ రూ.66.98 కోట్లు

ప్రవేశపెట్టిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

- కౌన్సిల్ సభ్యుల ఏకగ్రీవ ఆమోదం
- రూ.66.72 కోట్ల అంచనా వ్యయం
- ప్రతినెలా కార్మికుల వేతనాలు, డీజిల్‌కు రూ.73.98 లక్షల ఖర్చు



పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు



బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ మున్సిపల్ వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం చైర్‌పర్సన్ మంజుల ప్రవేశపెట్టారు. సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ హాజరయ్యారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయ, వ్యయ అంచనాల లెక్కలు చూస్తే రూ.26.3 లక్షలు మాత్రమే మిగులు కనిపిస్తుంది. ఆయా విభాగాల నుంచి రూ. 66.98 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు చూపించిన చైర్‌పర్సన్, అదే స్థాయిలో రూ.66.72 కోట్ల వ్యయ అంచనాలతో బడ్జెట్‌ను రూపొందించారు.

ఆదాయం రూపంలో రూ. 66.98 కోట్లు

వికారాబాద్ మున్సిపాలిటీకి 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నుల రూపంలో రూ. 10.05 కోట్లు, నాన్ ట్యాక్స్ రూపంలో రూ. 10.16 కోట్లు సమకూరవచ్చని అంచనా వేశారు. వివిధ రకాల గ్రాంట్స్, డిపాజిట్స్, క్యాపిటల్ ఆదాయం ద్వారా రూ.46.10 కోట్ల ఆదాయం సమకూరవచ్చని, మొత్తంగా రూ.66.98 కోట్లతో అంచనా బడ్జెట్‌ను చూపించారు.

ఖర్చు రూ. 66.72 కోట్లు

గత ఆర్థిక సంవత్సరం (2023–24) కంటే ఈ సారి సుమారు రూ.3.5 కోట్లు అధికంగా ఆదాయం చూపించారు. అదే స్థాయిలో ఖర్చును కూడా చూపించారు. మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు, శానిటేషన్ ఖర్చు, విద్యుత్ చార్జీలు, హరితహారం, క్యాపిటల్ వర్క్, వాహనాల డీజిల్ ఖర్చు ఇలా మొత్తంగా రూ. 66.72 కోట్ల అంచనా వ్యయం చూపించారు.

ప్రతి నెలా రూ.73.98 లక్షలు

మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల, కార్మికుల వేతనాలతో పాటు, వాహనాల డీజిల్, కరెంట్ బిల్లులతో ప్రతినెలా రూ.73.98 లక్షలు ఖర్చు అవుతుందని చైర్‌పర్సన్ మంజుల రమేష్ తెలిపారు. బడ్జెట్ సమావేశం అనంతరం ఆమె వైస్ చైర్‌పర్సన్ శంసాద్ బేగం, కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఏడాదికి రూ.8.8 కోట్లకు పైగా వేతనాల రూపంలోనే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. వీటితో పాటు మిగతా అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి నిధులు ఆగిపోయినట్లు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే, స్పీకర్ ప్రసాద్ కుమార్ సహకారంతో ప్రత్యేక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

కలిసి కట్టుగా అభివృద్ధి చేసుకోవాలి

కౌన్సిల్ సభ్యులు కలిసి కట్టుగా పనిచేసి పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకొని ప్రజలకు సమస్యలు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'హరిత' లక్ష్యాన్ని అధిగమించాలి



అధికారులతో మాట్లాడుతున్న రాహుల్ శర్మ

అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ

అనంతగిరి: జిల్లాలో హరితహారం లక్ష్యాన్ని అధిగమించేలా అధికారులు చొరవ తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో హరితహారంపై అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాది ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. శాఖల వారీగా ఔషధ మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా, గ్రామాల్లోని ఖాళీ స్థలాల్లో, పొలం గట్లపై మొక్కలు నాటాలన్నారు. సమావేశంలో డీఎఫ్ఓ జ్ఞానేశ్వర్, డీఆర్‌డీఓ ఏ శ్రీనివాస్, పరిశ్రమ శాఖ అధికారి వినయ్‌కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ అనిల్‌కుమార్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గోపాల్, గనుల శాఖ జిల్లా అధికారి సామెల్ జాకబ్, ఉద్యానవన శాఖ అధికారి అర్చన, మున్సిపల్ కమిషనర్లు మహమ్మద్ జాకీర్ అహ్మద్, వెంకటయ్య, బలరాం నాయక్, విక్రమ్ సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలమూరు ప్రాజెక్టుపై డ్రామాలు వద్దు

బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ

షాద్‌నగర్: పాలమూరు ప్రాజెక్టు జాతీయ హోదా పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న డ్రామాలు మానుకోవాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని ఏబీ కాంప్లెక్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు చేపట్టిన పాలమూరు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డ్రామాలకు తెరలేపిందన్నారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ కేంద్రంపై ఒకే రకమైన విమర్శలు చేస్తున్నారని అన్నారు. తాము పోరాటం చేయకుంటే పాలమూరు ప్రాజెక్టు ఎక్కడిదని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆరెండు పార్టీల నేతలు ఓట్ల కోసం రాజకీయాలు చేయడం సరికాదన్నారు. డ్రామాలు మానుకొని పాలమూరు అభివృద్ధి కోసం పాటు పడాలని హితవుపలికారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని, బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇస్తే రేవంత్ రెడ్డి బూరెల బుట్టలో పడ్డాడని, బుట్టిలో గారెలు తింటూ కూర్చొవద్దని.. ప్రజల మంచి చెడ్డలు చూడాలన్నారు. తెలంగాణలో అన్ని ఎంపీ స్థానాలను గెలుస్తామన్నారు. పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, నాగూరావు నామోజీ, శ్రీవర్ధన్ రెడ్డి, అందెబాబయ్య పాల్గొన్నారు.

సిఫారసు తప్పనిసరి..!

- పోస్టింగ్, ప్లేస్‌మెంట్ కోసం ఎమ్మెల్యేల ఇళ్లకు ఉద్యోగుల పరుగులు
- సిఫారసు లెటర్ ఉంటనే కావాల్సిన చోటికి బదిలీ
- గత ప్రభుత్వంలో వేళ్లూనుకుపోయిన సంస్కృతి
- అదే బాటలో ప్రస్తుత నేతలు
- కానరాని కౌన్సిలింగ్ ప్రక్రియ

వికారాబాద్: ప్రభుత్వ ఉద్యోగికి పోస్టింగ్ కావాలన్నా..? తాను కోరిన ప్లేస్ కావాలన్నా.. నేతలు, ఎమ్మెల్యేల సిఫారసు తప్పని సరిగా మారిపోయింది. ఎమ్మెల్యేల లెటర్ అనేది ఓ అనాధికారిక ఆచారంగా మారిపోయింది. ఇది అధికారులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రాష్ట్రంలో జరిగిన అధికార మార్పే ఈ ఆందోళనకు కారణమవుతోంది. ప్రభుత్వం మారడం తోపాటు జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు సైతం మారడంతో తమకు బదిలీ గండం తప్పదా..? అనే అనుమానం అధికారులను వెంటాడుతోంది. మండల స్థాయి నుంచి మొదలుకొని నియోజవకర్గ, జిల్లా స్థాయి అధికారుల వరకు ఎమ్మెల్యేలు, అధికార పార్టీ నేతల ఇళ్ల చుట్టూ తిరిగే పరిస్థితి తప్పడం లేదు. గత ప్రభుత్వానికి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు అధికారులు వంతపాడారనే కారణంతో ప్రస్తుత ఎమ్మెల్యేలు పలువురు అధికారులపై అసంతృప్తితో ఉండటమే ఈ బదిలీల యోచనకు కారణమని స్పష్టమవుతోంది. అయితే ఎమ్మెల్యేలు గెలిచింది మొదులు పలువురు అధికారులకు చివాట్లు పెట్టడంతో పాటు బదిలీలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం కొనసాగుతున్న బదిలీలు ఎంసీసీ (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్)లో భాగంగా జరుగుతున్నవే అయినా వారికి పోస్టింగ్‌లు మాత్రం ఎమ్మెల్యేల సిఫారసు మేరకు ఇస్తున్నారు. లాంగ్ స్టాండింగ్ పేరుతో అధికారులు జిల్లాల సరిహద్దులు దాటి వెళుతున్నప్పటికీ జిల్లాలో పోస్టింగులు ఎవరికి, ఎక్కడ ఇవ్వాలనే విషయాలను మాత్రం ఎమ్మెల్యేలు ఇచ్చిన లెటర్లే నిర్ధారిస్తున్నాయి.

వారం రోజులుగా..

వారం రోజులుగా మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఆరుగురు జిల్లా అధికారులు బదిలీ కాగా వారి స్థానంలో ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి వచ్చారు. జిల్లాలో 18 మండల పరిషత్‌లు ఉండగా ఇందులో నలుగురు మినహా మిగతా ఎంపీడీలను మార్చారు. సగానికిపైగా తహసీల్దార్లను, ఎస్ఐలకు సైతం స్థాన చలనం తప్పలేదు. ఒకరిద్దరు మినహా సీఐలు అందరినీ జిల్లా దాటించారు. అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, సీఎం, స్పీకర్ ఈ జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహిస్తున్నారు. వీరు జిల్లాను తమకు అనుకూల టీంతో నింపడం గానీ, లేదంటే తమ సిఫారసుతో పోస్టింగులు ఇచ్చేలా చేస్తున్నారు. ఏ అధికారికి పోస్టింగ్ కావాలన్నా ఎమ్మెల్యేల లెటర్ తప్పనిసరిగా మారిపోయింది.

కౌన్సిలింగ్‌కు కాలం చెల్లినట్టేనా..?

ప్రత్యేకంగా ఒక ఉద్యోగిని బదిలీ చేశారంటే క్రమశిక్షణా చర్యల్లో భాగంగానే ఉంటుంది. మిగతా సందర్భాల్లో శాఖల వారీగా కౌన్సిలింగ్ నిర్వహించి సీనియారిటీ ఆధారంగా పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల బదిలీల్లో మినహా ఈ సంప్రదాయం పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. మిగిలిన శాఖల్లో కౌన్సిలింగ్ అనేది కాగితాలకే పరిమితం అయ్యింది. చివరకు గ్రామ స్థాయిలో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగులు ఇవ్వాలన్నా ఎమ్మెల్యే లెటర్ కావాల్సిందే అనే స్థాయికి వ్యవస్థ దిగజారి పోయింది.

నత్తే నయం..!



అసంపూర్తిగా చించల్‌పేట్ - అత్తాపూర్ రోడ్డు

- రోడ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం
- ఏళ్లు గడిచినా పూర్తికాని వైనం
- 2020 -21లో జిల్లాకు 13 రోడ్లు మంజూరు
- అంచనా వ్యయం రూ. 56.85 కోట్లు
- నిర్మించాల్సిన దూరం 93.9 కిలో మీటర్లు
- ఇంకా పూర్తి కాని రోడ్లు ఐదు
- తీవ్ర ఇబ్బందుల్లో ప్రయాణికులు

వికారాబాద్: ఈ ఫొటోలో కనిపిస్తున్న రోడ్డు నవాబుపేట మండలం చించల్‌పేట్, అక్నాపూర్ గ్రామాలకు వెళ్లేదారి.. రెండు దశాబ్దాల క్రితం పీఎంజీఎస్‌వై పథకం కింద చించల్‌పేట్ గేట్ నుంచి అక్నాపూర్ వరకు 8 కిలోమీటర్ల రోడ్డు వేశారు. ఐదేళ్ల క్రితం ఆ రోడ్డు పూర్తిగా పాడై గుంతల మయంగా మారింది. దాన్ని తిరిగి నిర్మించకపోవడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. రెండేళ్ల క్రితం చించల్‌పేట్ గేట్ నుంచి అక్నాపూర్ వరకు, అలాగే అక్నాపూర్ నుంచి నారేగూడ వరకు కొత్త రోడ్డు నిర్మాణానికి రూ. 12 కోట్లు మంజూరయ్యాయి. 50 శాతం పనులు కూడా పూర్తి కాలేదు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య నిత్యం ఇదే మార్గంలో ప్రయాణిస్తుండటం గమనార్హం.

ఏళ్ల తరబడి నరకయాతన

ప్రాంతాల కనెక్టివిటీకి రోడ్లు ఎంతో కీలకం. అయితే ప్రభుత్వాలు రోడ్ల నిర్మాణంపై దృష్టి సారించడం లేదు. దీంతో చాలా రోడ్లు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మరికొన్నింటికి అనుమతులు కూడా రావడం లేదు. దీంతో ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే జంకుతున్నారు. రోడ్లు దెబ్బతినడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పది కిలో మీటర్లు ఎక్కువైనా సరే చుట్టూ తిరిగి వేరే మార్గాల్లో గమ్యం చేరుకుంటున్నారు. వంతెనలు, బ్రిడ్జీల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పనులు ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. విధిలేని పరిస్థితుల్లో దెబ్బతిన్న రోడ్లపైనే ప్రయాణం చేస్తున్నా రు. రోడ్ల నిర్మాణానికి అనుమతులు వస్తున్నా సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు రాక అప్పుల పాలవుతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో రోడ్ల పరిస్థితి ఇదీ..

2020 –21 ఆర్థిక సంవత్సరంలో జిల్లాకు పీఎంజీఎస్‌వై కింద 13 రోడ్లు మంజూరయ్యాయి. ఇందులో భాగంగా 93.9 కిలో మీటర్లు బీటీ రోడ్లు వేయాలని నిర్ణయించారు. ఇందు కోసం రూ.56.85 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందులో కొన్ని పనులను రెండున్నరేళ్ల క్రితం, మరి కొన్నింటిని ఏడాది క్రితం ప్రారంభించారు. వీటి ఎనిమిది రోడ్లు ఇటీవల పూర్తికాగా మరో ఐదు నిర్మాణ దశ ఉన్నాయి. నిర్మాణంలో ఉన్నాయని అధికారులు చెబుతున్నా వివిధ కారణాల వల్ల మధ్యలో ఆపేసినట్లు సమాచారం. రోడ్డు పనుల్లో జాప్యం కారణంగా నిర్మాణ వ్యయం పెరిగిపోతోంది. నిధుల కొరత కారణంగా కొనిచోట్ల రోడ్ల నిర్మాణం నిలిచిపోయిన మాట వాస్తవమేనని, సాధ్యమైనంత త్వరగా పనులను పూర్తి చేస్తామని పంచాయతీ రాజ్ ఈఈ ఉమేశ్ తెలిపారు.

క్లుప్తంగా

కనుమరుగవుతున్న పురాతన కట్టడాలు



పెద్దేముల్‌లో బురుజు

పెద్దేముల్‌: చారిత్రక కట్టడాలు కనుమరుగై పోతున్నాయి. అప్పట్లో వీటిని చూసి గ్రామంలోని జనాభాను చెప్పేవారట. గతంలో ప్రతీ గ్రామంలోనూ ఒకటి, రెండు బురుజులు ఉండేవి. వీటి ద్వారానే ఊరి విస్తీర్ణం, జనసంఖ్యను అంచనా వేసేవారట. కానీ కాలక్రమేణా శిథిలమవుతున్న బురుజులు ఆదరణ లేక కూలిపోతున్నాయి. చరిత్రకు నిదర్శనంగా నిలిచే పాతకాలం కట్టడాలను కాపాడుకుంటే బాగుం డేదని ప్రజలు, వృద్ధులు సూచిస్తున్నారు.

ధ్యానంతో ఏకాగ్రత



మన్నెగూడలో ధ్యానం చేస్తున్న విద్యార్థులు

పూడూరు: నిత్య జీవితంలో ప్రతిఒక్కరికీ ధ్యానం అవసరమని పిరమిడ్‌ స్పిరిచువల్‌ సొసైటీ ధ్యాన ప్రచారకర్త నవీన్‌ అన్నారు. మండల పరిధిలోని మన్నెగూడ, ఎన్కేపల్లి గ్రామాల్లోని పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ధ్యానంపై అవగాహన కల్పించారు. ధ్యానంతో దీర్ఘకాలిక రుగ్మతలను దూరం చేయవచ్చని తెలిపారు. ప్రస్తుత సమాజంలో అనేక మంది బీపీ, షుగర్‌, క్యాన్సర్‌ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని, ధ్యానం ద్వారా వీటిని దూరం చేసుకోవచ్చని వివరించారు. ప్రతీరోజు 15 నిమిషాలు మెడిటేషన్‌ చేయడం ద్వారా ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, రోగ నిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్‌ సంస్థ సభ్యులు నవీన్‌, బాబు, చెన్నయ్య, వేణు, శ్రీనివాస్‌, అంజయ్య, రాఘవేందర్‌రెడ్డి, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

ఒకరి దుర్మరణం

శంకర్‌పల్లి: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శంకర్‌పల్లి మున్సిపల్‌ పరిధిలోని ఫత్తేపురం ఫ్లైఓవర్‌పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఏర్వగూడకి చెందిన కుసుమగళ్ల వెంకటేశ్‌(31) బైక్‌పై సంగారెడ్డి జిల్లా నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి వెళ్లి గురువారం రాత్రి తిరిగి వస్తుండగా ఫత్తేపురం ఫ్లైఓవర్‌ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకటేశ్‌ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడిఅక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వినాయక రెడ్డి తెలిపారు.

మరో ఘటనలో..

యాచారం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు... మండల పరిధిలోని తక్కళ్లపల్లికి చెందిన పట్నం శ్రీశైలం(50) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇబ్రహీంపట్నంలో విధులు ముగించుకుని శ్రీశైలం శుక్రవారం రాత్రి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా సాగర్‌ రోడ్డుపై క్రిడాక్షేత్రం వద్ద ముందు వెళ్తున్న లారీని అతడి బైక్‌ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మమ్మ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకర్‌ కుమార్‌ తెలిపారు.

మరమ్మతు చేయరు.. నీరు వదలరు

- కొంపెట్‌పల్లి ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ఆవేదన
- నాసిరకంగా పనులు

అన్నీ ఉన్నా.. అల్లుని నోట్లో శని అన్న చందంగా కొంషెట్‌పల్లి ఆయకట్టు రైతుల పరిస్థితి తయారైంది. ప్రాజెక్టు నిండా పుష్కలంగా నీరున్నా కాలువలు, తూములకు మరమ్మతుల చేయక పంటకు సాగు నీరందని దుస్థితి దాపురించింది. పేరుకే ప్రభుత్వం నిధులు విడుదల చేసినా తూతూమంత్రంగా పనులు చేసి చేతులు దులుపుకొంది.

మర్పల్లి: నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో చెరువులు, ప్రాజెక్టుల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోంది. గత ప్రభుత్వం మిషన్‌ కాకతీయ పథకం కింద చెరువుల మరమ్మతుల కోసం రూ.కోట్లు ఖర్చు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు పనులు నాసిరకంగా చేయడంతో ప్రాజెక్టులు కళావిహీనమైపోయాయి. ఇందుకు నిదర్శనమే మండల పరిధిలోని కొంషెట్‌పల్లి ప్రాజెక్టు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామరావు కొంషెట్‌పల్లి ప్రాజెక్టుకు కోటి రూపాయలు మంజూరు చేసి నిర్మించారు. కట్ట పొడవు 990 మీటర్లు ఉండగా, అలుగు 105 మీటర్లు ఉంది. కుడి, ఎడమ కాలువల నుంచి ఆయకట్టు రైతులకు నీరు అందించేందుకు రెండు తూములను బిగించారు. కాలువలకు మరమ్మతులు చేపట్టక పోవడంతో ప్రాజెక్టు చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక ఇబ్బందులు పడేవారు. దీంతో 2014 ఏప్రిల్‌లో ప్రాజెక్టు కాలువల మరమ్మతులకు రూ.1.76 కోట్లను మంజూరు చేశారు. కాంట్రాక్టర్‌ పనులు నాసిరకంగా చేపట్టడంతో తూములు ముళ్ల పొదలు, గడ్డితో మూసుకుపోయాయి. చెరువులో నీరు పుష్కలంగా ఉన్నా చివరి ఆయకట్టు రైతులకు అందని దుస్థితి నెలకొంది. మిషన్‌ కాకతీయ పథకం చెరువులో పూడికతీత చేపట్టడంతో నీటి మట్టాలు సైతం పెరిగాయి.



వరద ఉధృతికి కొట్టుకుపోయిన అలుగు బెడ్‌




నిండు కుండలా కొంషెట్‌పల్లి ప్రాజెక్టు

కొట్టుకుపోయిన అలుగు బెడ్‌

గత సంవత్సరం కురిసిన అకాల వర్షాలకు పాజెక్టులో గణనీయంగా నీటి మట్టాలు పెరిగాయి. దీంతో వరద నీటి ఉధృతికి 120 మీటర్ల బెడ్‌ కొట్టుకు పోయింది. అక్కడక్కడ పగుళ్లు వస్తున్నట్లు ఆయకట్టు రైతులు తెలుపుతున్నారు. ఎడమ కాలువ తూము పక్కన చెరువులో ముళ్ల పొదలు, బేశారం మొక్కలు పెరిగి దారుణంగా తయారైంది. దీంతో నీరు వదలక పోవడంతో ఆయకట్టు రైతులకు ఇబ్బందిగా మారింది. గతేడాది తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన దశాబ్ది ఉత్సవాలలో చెరువుల పండుగ మొక్కుబడిగానే చేశారని ఆయకట్టు రైతులు అంటున్నారు. చెరువుకట్టపై పేరుకుపోయిన కంచె, ముళ్ల పొదలను తొలిగించాల్సి ఉన్నా పూర్తి స్థాయిలో చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి.

బీళ్లుగా మారుతున్నాయి

వానకాలంలో 1,250 ఎకరాలకు యాసంగిలో 550 ఎకరాలకు సాగు నీరు అందించే ఎడమ, కుడి కాలువల తూములు మరమ్మతులకు నోచుకోలేదు. ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా ఆశించిన మేరకు పంటలకు సరిపడా వదలడం లేదని



ఎడమ తూము పక్కన పేరుకుపోయిన ముళ్ల పొదలు

రైతులు వాపోతున్నారు. దీంతో పంట దిగుబడులు తగ్గి అప్పుల ఊబిలో రైతులు చిక్కుకుంటున్నారు. ఆయకట్టు కింద వందలాది ఎకరాలకు సాగు నీరు అందక పంట పొలాలు బీడు భూములుగా మారుతున్నాయి. ఇప్పటికైనా కొత్తగా కొలువు దీరిన కాంగ్రెస్‌ ప్రభుత్వం కొంషెట్‌పల్లి ప్రాజెక్టుకు ప్రత్యేక నిధులు కేటాయించి కాలువలకు మరమ్మతులు చేయించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

హామీలను పక్కాగా అమలుచేస్తాం

షాబాద్‌: ఎన్నికల ముందు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని ఆ పార్టీ జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్‌, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్‌ పార్టీ ఏబ్లాక్‌ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్‌ మండల పరిధిలోని బోడంపహాడ్‌ గ్రామంలో మహిళా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం మహిళా గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎనుకున్నారు. అధ్యక్షురాలుగా కారు సువర్ణ, ఉపాధ్యక్షురాలుగా మొగిలిగిద్ద వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి జ్యోతి, కార్యదర్శులుగా రావులపల్లి పార్వతమ్మ, సుమలత, సభ్యులుగా భాగ్యమ్మ, వెంకటమ్మ, యాదమ్మ, లక్ష్మమ్మ, చంద్రమ్మ, మాణెమ్మ, ఎలమ్మను ఎనుకున్నారు. ఈ సందర్భంగా జ్యోతి భీంభరత్‌ మాట్లాడుతూ.. పేదలకు అవసరమై సంక్షేమ పథకాలను అమలు చేసేందుకు ప్రజాపాలన కార్యక్రమం చేపట్టామన్నారు. సీఎం రేవంత్‌ రెడ్డి ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తారని అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ తన సత్తా చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు సర్పంములు చిన్నయ్య, రఫీక్‌, నవీన్‌, శివయ్య, రఘుపతిరెడ్డి, కృష్ణ, సురేశ్‌, సత్తయ్య తదితరులున్నారు.



బోడంపహాడ్‌ కమిటీ సభ్యులతో జ్యోతి

ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ రాకేశ్‌

ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్‌ డాక్టర్‌ రాకేశ్‌

షాద్‌నగర్‌: ప్రతి ఒక్కరికీ బీపీ, షుగర్‌ పరీక్షలు విధిగా నిర్వహించాలని ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్‌ డాక్టర్‌ రాకేశ్‌ వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన ఆరోగ్య సిబ్బందికి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్‌సీడీ (సంక్రమించని వ్యాధులు) కార్యక్రమంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్‌సీడీ జిల్లా కోఆర్డినేటర్‌ డాక్టర్‌ రాకేశ్‌ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో 30 ఏళ్లు నిండిన వారు జనాభాలో 52శాతం మంది ఉంటారని అన్నారు. వారికి విధిగా బీపీ, షుగర్‌ పరీక్షలు నిర్వహించాలన్నారు. వ్యాధుల బారిన పడిన వారిని గుర్తించి ఆన్‌లైన్‌లో వారి వివరాలను నమోదు చేయడంతో పాటుగా వారికి మందులు పంపిణీ చేయాలన్నారు. నిరుపేదల ఆరోగ్య సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వైద్య సిబ్బంది విధులు నిర్వహించాలని అన్నారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్‌లో వివరాలు ఏవిధంగా నమోదు చేయాలన్న అంశంపై ప్రొజెక్టర్‌ ద్వారా సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీఎంఓ రాజశేఖర్‌, సౌజన్య, శ్రీలత, హెల్త్‌ ఎడ్యుకేటర్‌ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు వసూలయ్యేనా?

- అనుమతుల పేరిట ఎగ్గొడుతున్న సెల్‌టవర్ల యజమానులు
- ఏళ్లు గడుస్తున్నా పైసా చెల్లించని వైనం
- పట్టించుకోని అధికారులు
- ఆదాయం కోల్పోతున్న జీపీలు

దోమ: గ్రామాలలో ఏర్పాటు చేస్తున్న సెల్‌ టవర్ల విషయంలో అధికారులు నిబంధనలు పాటించడం లేదు. కొన్నింటికి అనుమతులు ఉంటున్నా మరికొన్నింటికి లేకుండానే యజమానులు ఏర్పాటు చేసుకుంటుండడంతో వాటి నుంచి రావాల్సిన ఆదాయం గ్రామ పంచాయతీలకు రావడం లేదు. దీంతో అధికారులు ఉన్న టవర్లతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన టవర్ల పన్నులను వసూలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో పలు కంపెనీలకు చెందిన 25పైగా సెల్‌ఫోన్‌ టవర్లు ఉన్నాయి. వాటిని ఏర్పాటు చేస్తున్నా యజమానులు కోట్ల రూపాయాల్లో వ్యాపారం చేసుకుంటున్నప్పటికీ, వాటికి సంబంధించిన పన్నులను మాత్రం చెల్లించలేకపోతున్నారు. దీంతో గ్రామ పంచాయతీలకు రావాల్సిన ఆదాయం కోల్పోతున్న పరిస్థితి నెలకొంది. ఎప్పుడూ ఇంటి పన్నుల వెంట పడే గ్రామ పంచాయతీ కార్యదర్శులు.. సెల్‌ టవర్లకు సంబంధించిన పన్నులను ఎందుకు వసూలు చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

గ్రామాలలో ఏర్పాటు చేసిన సెల్‌ టవర్ల మూలంగా గ్రామ పంచాయతీలకు ఏడాదికి సుమారుగా రూ.30 వేల నుంచి 40 వేల వరకు ఆదాయం వస్తుందని తెలుస్తోంది. మండల కేంద్రంలోనే మూడు టవర్ల ఉండగా ఆయా గ్రామాలలో మరి కొన్ని ఉన్నాయి. టవర్లు ఏర్పాటు చేసే సమయంలో సుమారు 300 గజాల నుంచి 400 గజాల స్థలంలో చూట్టూ ప్రహరీతో ఉండాలి. కానీ అటువంటి నిబంధనలేమీ అమలవట్లేదు. మరో పక్క పలు గ్రామాలలో సెల్‌ టవర్లు ఇళ్ల మధ్యలో ఉండడంతో రేడియేషన్‌ సమస్యలు తలెత్తుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కోల్పోతున్న ఆదాయం

సెల్‌ టవర్‌ నిర్మాణానికి ముందుగా టవర్‌ ఏర్పాటు చేసిన స్థలానికి సంబంధించిన పత్రాలతో పాటు గ్రామ పంచాయతీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం పంచాయతీకి రూ.10 వేల అనుమతి ఫీజు కట్టాల్సి ఉంటుంది. డబ్బులు చెల్లించగానే రసీదు ఇచ్చి అక్కడున్న విస్తీర్ణాన్ని బట్టి ఏడాదికి ఎంత పన్ను అనేది అధికారులు గుర్తించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రతి ఏడాది టవర్ల నుంచి పన్ను కట్టించుకోవాలనే నిబంధనలు ఉంటాయి.



దొంగ ఎన్కేపల్లిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన సెల్‌ టవర్‌

కానీ అధికారులు మాత్రం అవేవి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. సెల్‌ టవర్లను అద్దెకు ఇచ్చే వారు గ్రామ పంచాయతీతో ఒప్పందం చేసుకొని అనుమతి పొందుతున్నారు. దీంతో పంచాయతీకి రావాల్సి ఆదాయం కోల్పోతున్న పరిస్థితి నెలకొందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

అనుమతులు లేకుండానే ఏర్పాటు



తమ గ్రామ పంచాయతీలో ఓ కంపెనీకి చెందిన సెల్‌ టవర్‌ను కొన్నేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. కానీ ఆ టవర్‌కు ఎలాంటి అనుమతులు లేవు. దీంతో గ్రామ పంచాయతీలకు రావాల్సిన పన్నులను ఎగ్గొడుతున్నారు. విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు.

– సంజీవ్‌ కుమార్‌, దొంగ ఎన్కేపల్లి, మాజీ వార్డు సభ్యుడు

చర్యలు తీసుకుంటాం



సెల్‌ టవర్లకు సంబంధించిన పన్నులను కట్టించుకునేలా చర్యలు తీసుకుంటాం. గ్రామ పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి అనుమతులు లేని వాటికి గుర్తిస్తున్నాం. పన్నులు కట్టని టవర్లకు పన్నులు కట్టించుకునేందుకు నోటీసులను అందజేస్తాం. పన్నులు రాబట్టేలా చర్యలు తీసుకుంటాం.

– సోమలింగం, ఎంపీఓ, దోమ

నగరంలో భారీగా నకిలీ కాస్మొటిక్స్‌

- డిటర్జెంట్స్‌నూ వదిలి పెట్టని కల్తీరాయుళ్లు
- పోలీసుల అదుపులో నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని పలు మార్కెట్లలో భారీగా నకిలీ కాస్మొటిక్స్‌ చెలామణి అవుతున్నాయి. ఇదే స్థాయిలో డిటర్జెంట్స్‌ సైతం ఉన్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వీటికి సంబంధించి ప్రాథమిక ఆధారాలు సేకరించిన పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. వీటిని తయారు, సరఫరా చేస్తున్న నిందితుల కోసం గాలించిన టాస్క్‌ఫోర్స్‌ పోలీసులు ఓ ఘరానా ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరు ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ ఉత్పత్తులు తయారు చేయడంతో పాటు ఆయా సంస్థలకు చెందిన ఉత్పాదనల్నీ కల్తీ చేస్తున్నట్లు గుర్తించారు. వీరి నుంచి భారీ స్థాయిలో కాస్మొటిక్స్‌, డిటర్జెంట్స్‌తో పాటు కాఫీ, టీ పొడులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బ్రూక్‌ బాండ్‌, రెడ్‌ లేబుల్‌, లైజాల్‌, హార్పిక్‌, సర్ఫ్‌ ఎక్సెల్‌ కంపెనీల పేర్లతో ఉన్నవి ఉన్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి శనివారం పోలీసులు వివరాలు వెల్లడించనున్నట్లు సమాచారం.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ముగ్గురి అరెస్టు

ఇబ్రహీంపట్నం: ఇంటిని అద్దెకు తీసుకొని మహిళలతో వ్యభిచారం చేయిస్తున్న నిందితులను హ్యూమన్‌ ట్రాఫికింగ్‌ పోలీసులు, ఆదిబట్ల పోలీసులు శుక్రవారం సంయుక్తంగా దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని నాదర్‌గుల్‌ ప్రాంతంలో ఓ మహిళ ఇంటిని అద్దెకు తీసుకుంది. డబ్బు ఆశ చూపి కొందరు మహిళలను తన ఇంటికి రప్పించి వ్యభిచారం నిర్వహిస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో నిర్వాహకులు జయశ్రీతో పాటు మహేశ్వరం ప్రాంతానికి చెందిన శ్రీధర్‌, రాంజీను పోలీసులు అరెస్టు చేశారు. బాధిత మహిళను హోంకు తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మీర్‌పేట పీఎస్‌ పరిధిలో..

మీర్‌పేట: వ్యభిచార గృహంపై ఎస్‌ఓటీ పోలీసులు దాడిచేసి ముగ్గురిని అరెస్ట్‌ చేసిన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. మీర్‌పేట ఉద్యోగ్‌నగర్‌లో నివాసముండే నిర్వాహకురాలు నోసిని సుజాత (35) తన ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్‌ ఎస్‌ఓటీ పోలీసులు శుక్రవారం సాయంత్రం ఇంటిపై దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు జిల్లెలగూడకు చెందిన విటులు కాపాటి లక్ష్మీనారాయణ (40), తుక్కుగూడ సర్దార్‌నగర్‌కు చెందిన తల్లా ప్రమోద్‌ (28)ను అదుపులోకి తీసుకుని మీర్‌పేట పోలీస్‌ స్టేషన్‌లో అప్పగించారు. వీరి వద్ద నుంచి రూ.17,080 నగదు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం



భీంభరత్‌ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్‌

చేవెళ్ల: కాంగ్రెస్‌ పార్టీతోనే పేదలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్‌ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో చేవెళ్ల మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌ జూలూరి పాండుగౌడ్‌, మాజీ ఉప సర్పంచ్‌ శంకర్‌ యాదవ్‌ తదితరులు కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. చేవెళ్ల పీఏసీఎస్‌ చైర్మన్‌లు డి.వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో కుమ్మెర గ్రామ మాజీ సర్పంచ్‌ పాండుగౌడ్‌, వీరేశం, పాషా, మురహరి, శంకరయ్య, క్రిష్ణరెడ్డి, బీజేపీకి చెందిన ఉప సర్పంచ్‌ శంకర్‌యాదవ్‌తో పాటు బి.దర్శన్‌, జంగయ్య, కుమార్‌, హుస్సేన్‌, వెంకటస్వామి తదితరులు కాంగ్రెస్‌ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. వారికి పామెన భీంభరత్‌ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ ప్రభాకర్‌, మండల వర్కింగ్‌ ప్రెసిడెంటగ్‌ శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్‌ డైరెక్టర్‌ మధుసూదన్‌రెడ్డి, బీసీసెల్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు ఉన్నారు.

నిరుపేదల సంక్షేమమే లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌రూరల్‌: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్‌ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన శివకుమార్‌ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్‌ శుక్రవారం శివకుమార్‌ను, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ 2.5లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు సీఎం చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఆర్థిక కష్టాలతో ఎంతోమందికి సకాలంలో వైద్యం అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. నిరుపేదలకు కార్పొరేట్‌ వైద్య సేవలను అందించాలనే ఆలోచనతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. పేదల కష్టాలు తెలిసిన నాయకులు రేవంత్‌రెడ్డి వారికి అండగా ఉంటారని అన్నారు. నిరుపేదలను ఆదుకోవాలనే ఆలోచనతో సీఎం సహాయ నిధి నుంచి నిధులను మంజూరు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్‌, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటిరాజు, నాయకులు లింగం, రాజు, మాలిభాయ్‌, కె.లింగం, రంజిత్‌ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

ప్రేమను ఒప్పుకోలేదని..

మనస్తాపంతో టీసీఎస్‌ ఉద్యోగి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్‌: ప్రేమ విఫలం కావడంతో టీసీఎస్‌ సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా వేములపల్లికి చెందిన సత్తినాగ చంద్రప్రకాష్‌(24) హైదరాబాద్‌లోని ఆదిబట్ల ప్రాంతంలో 2021 నుంచి టీసీఎస్‌లో సిస్టమ్‌ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తూ స్థానిక హాస్టల్లో ఉంటున్నాడు. తోటి మహిళా ఉద్యోగినితో స్నేహంగా మెలిగేవాడు. అయితే చంద్రప్రకాష్‌ ప్రేమను ఆ ఉద్యోగిని ఒప్పుకోకపోవడంతో మనస్థాపానికి గురై శుక్రవారం హాస్టల్‌ గదిలో ఫ్యాన్‌కు ఉరి వసుకొని చంద్రప్రకాష్‌ ఆత్మహత్య చేసుకున్నాడు. ఆఫీస్‌లో పనిచేసే బాబా ద్వారా చంద్రప్రకాష్‌ స్నేహితులు పవన్‌, ప్రవీణ్‌కు విషయం తెలిసింది. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.